పి.వి.బి. శ్రీరామమూర్తి

# కాకా మామయ్య

"అమ్మా! నా కథకు ప్రైజొచ్చిందీ!" నేను రాసిక కథకు ప్రైజొచ్చిందన్న టెలిగ్రాం అందుకున్న ఆనందంతో ఒక్క గంతేసి అమ్మకా విషయం చెప్పాను రాగయుక్తంగా. దేవుడింట్లోంచి అప్పుడే వస్తున్న అమ్మ ముఖం ఆనందంతో హారతి కర్పూరంలా వెలిగింది.

"నీక్కాకపోతే ఇంకెవరికి వస్తుందిరా! ఇప్పుడే నీ కృషి ఫలించాలని ఆ దేవికి మొక్కుకున్నాను. ఇదిగో హారతి! కళ్లకి అద్దుకో" అని హారతి ఇచ్చింది. కళ్లకద్దుకుని అమ్మకాళ్లకి నమస్కరించాను. అమ్మ 'అమ్మమనసు'తో దీవించింది. "మావయ్యకు ఫోన్ చెయ్యి" అంది




"తప్పకుండా. ఇప్పుడే చేస్తాను" అన్నాను.

కామేశం మామయ్య మాజీ రచయిత. ఒక రకంగా ఆయన పోసే ఊపిరే నా ఈ సాహిత్యం వ్యాసంగానికి చిన్నప్పట్నుంచీ కథలు రాయడంలో మాకు ట్రైనింగ్ ఇచ్చేవాడు. కథల వర్క్ షాపు పెట్టేవాడు. పదేళ్లలోపు వయసున్న పిల్లల్ని కూర్చోబెట్టి కథలు చెప్పి ముగింపు మళ్లీ చెప్పకుండా లేచిపోయేవాడు. 'దీనికి ముగింపేమిటని?' ఆ ముగింపుని మాచేత చెప్పించేవాడు. ఆ తరువాత తను చెప్పేవాడు. ఆ తరువాత కార్డులో కథ పంపేవాడు. ముగింపు మళ్లీ కార్డులో అనేవాడు. ఈలోగా మమ్మల్ని అంటే మామయ్య కొడుకుల్నీ, తమ్ముడి పిల్లల్నీ, ఆలోచించమనేవాడు. మంచి ముగింపునకు పది రూపాయలు ఎమ్.ఓ. చేసేవాడు. ఈ రకంగా మాలో ఆలోచనలని రేకెత్తింపజేసి మాలో సాహిత్యతృష్ణని పెంపొందింప జేసేవాడు, అయితే ఆయన కృషి ఫలితంగా మొలకెత్తిన సాహిత్యపు మొలకను నేనొక్కణ్ణే!

అందుకే నాకు ప్రైజొచ్చిన విషయం ముందు కామేశం మామయ్యకే తెలియజెయ్యాలని ఫోన్ దగ్గరకు వెళ్ళబోతుంటే కాలింగ్ బెల్ రింగయింది.

తలుపు తెరిచాను కదా? వెతకబోయిన తీగ!

"హాయ్ మామయ్యా! నీకు ఫోన్ చేద్దామనే వెళ్తున్నా! నువ్వే వచ్చేశావ్" అంటున్నంతలో "ఏరా అన్నయ్యా! నీకు నూరేళ్ళాయిష్షు. ఇప్పుడే కన్న కథకు ప్రైజొస్తే ముందు నీకు ఫోన్ చెయ్యమంటున్నాను. నువ్వే వచ్చేసావ్! ఏంటి కథ? అకస్మాత్తుగా ఊడిపడ్డావు? వదినా, పిల్లలూ క్షేమమేనా? అరుంధతి బాగుందా? లలితేం చేస్తోంది?" అని అమ్మ ప్రశ్నల వర్షం కురిపించేస్తోంది.

"అమ్మా! ముందు మామయ్యని లోనికి రానిస్తావా లేదా?" అని వాలు కుర్చీవేసి మామయ్యని కూర్చోమన్నాను. ఫేను వేసాను. ఫ్రిజ్‌లోంచి వాటర్ బాటిల్ తీస్తుంటే "ఒరే నాన్నా! నాకు కూలింగ్ వాటరొద్దు. మామూలు నీళ్లివ్వు అన్నాడు. అమ్మ ఫిల్టర్ వాటరిచ్చింది.

"ఏంటమ్మా! ఈ మధ్య ఉత్తరాలు లేవూ, ఫోన్లు లేవు. బావగారు బాగున్నారా?" అంటూ అమ్మమీద ప్రశ్నల బాణాలు సంధించాడు కామేశం మామయ్య.

అమ్మ అన్నింటికీ జవాబులిచ్చింది.

"ఇంతకీ అరుంధతికేమైనా సంబంధాలు చూస్తున్నావా? కిశోరింకా పెళ్ళి చేసుకోడా? ఆ స్టేట్స్‌లోనే సెటిలయి అక్కడే ఎవరినో చేసేసుకుంటాడా?" అనడిగింది,

"వస్తున్నా! అక్కడికే వస్తున్నా! అరుంధతికి సంబంధం కుదిరింది. అబ్బాయి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. న్యూయార్క్‌లో ఉంటున్నాడు. మొన్ననే చూపులయ్యాయి. కార్తీకమాసంలో పెళ్లి" అంటుండగా-

"కట్నమెంతరోయ్!"

"వాళ్లేం వద్దన్నారు. కుర్రాడొక్కడే. అరుంధతి కూడా ఎమ్మెస్సీ కంప్యూటర్స్ కదా. అదీగాక నేను ముందే చెప్పాను కట్నం అనుకుంటే గడపే తొక్కద్దనీ. అదీగాక అబ్బాయి తండ్రి మంచి రచయిత. కొడుక్కి కట్నకానుకలతో సంబంధం లేదన్నాడు. వాళ్లక్కావాల్సింది. అమ్మాయి ఫెయిర్‌గా వుండాలి, చదుకోవాలి" అంటుండగా-

"అరుంధతికేం బంగారుబొమ్మ, చదువుల సరస్వతి మరి కిశోర్ సంగతి?" అడిగింది అమ్మ.

"వాడు నువ్వన్నట్టే అమెరికాలోనే సంబంధం చూసుకున్నాడు. అయితే వాడు సంప్రదాయాలని అతిక్రమించకుండా వాళ్ల తల్లిదండ్రులను మన దగ్గరకు పంపాడు. వాళ్ళొచ్చారు. మనమూ పిల్లను చూసాం. పిల్ల అమెరికాలో డాక్టర్. కట్నకానుకలు నేనొద్దన్నాను, మీ వదిన ఉంది కదా! వాళ్లి స్తామంటున్నప్పుడు మీ రెండుకడ్డు తగుల్తారని నాతో ఘర్షణ. నాకసహ్యం వేసింది. మీ ఆడవాళ్ళు మా మొగవాళ్ల మాటలు కానిస్తారా? ఏం?" అని కోపం ముఖంలో పులుము కున్నాడు.

"సర్లే! మీరడగలేదు. వాళ్లిస్తామన్న ప్పుడేం పుచ్చుకోవడానికి?" అనేసి ఇంతకీ "ఎంతిస్తారేంటి?" అన్నది.

"అదికాదమ్మా. అమ్మాయి డాక్టరు. వీడా డాక్టర్. నేనా బాగా వెనకేశాను. వెధవది డబ్బుతో ఏం పనింకా? కృష్ణారామా అనుకోకుండా" అన్నాడు.

నేనాశ్చర్యపోయాను. మామయ్య నాస్తి కుడు. కష్ణా రామా అన్న పదాలు వినడం ఇదే మొదటిసారి. అందుకే "ఏంటి మామయ్యా! నువ్వా ఆస్తికుడిగా మారిపోయావా? దేవుడే లేడనే వాడివి కదా!" అన్నాను పానకంలో పుడకలాగా మామయ్య కొంచెం షాక్ తిన్నట్టు ముఖం పెట్టి -

"ఏం చెప్పమంటావురా, ఇంట్లో ఎవరికైనా జలుబు చేస్తే ఇటు డాక్టర్‌కి ఫీజు తప్పదు. అటు వెంకన్నకి మొక్కుబడీ తప్పదు. అలాంటి సమాజంలో బతుకుతున్న మనకి ఎంత కాదనుకున్నా ఈ మాటలొచ్చేస్తున్నాయి" అనేసి "మీ వదినని ఈ విషయంలో నేనెంత మాత్రం క్షమించలేకపోతున్నాను" అన్నాడు.

"సర్లే! ఇంతకీ కట్నం ఎంతట?"

"ఏమో నాకు తెలీదు. అయిదు లక్షలో, ఆరులక్షలో అనుకుంటాను. వాళ్లకదేం కాదు" అన్నాడు.

ఆ తరువాత కాఫీ తాగి "ఇంతకీ నీ కథ దేనిమీద రాసావోయ్?" అన్నాడు.

'తెల్లకాగితం మీద' అనాలనుకుని బావుండదని "నేటి పరీక్షా విధానం, అవకత వకలు మీద" అని కథని సంక్షిప్తంగా చెప్పాను.

"నిజమే! నువ్వు పరీక్షా విధానం మీద రాసావ్. అసలు విద్యా వ్యవస్థలోనే లోపం అంతావుంది. ఆ 'మూలాలు' కనుక్కోగలగాలి. ఇవాళ సమాజం భ్రష్టు పట్టడానికి కారణం ఏమిటి? ఎక్కడ? ఆ మూలాల్ని పట్టకోవాలి. అప్పుడే డొంకంతా కదుల్తుంది" అన్నాడు.

కామేశం మామయ్యతో మాట్లాడినప్పుడల్లా ఒక్కో పదం ఎక్కువ మాట్లాడ్డం వినిపిస్తుంటుంది. కొన్నాళ్లు బూర్జువా సమాజం అని అనేవాడు. కొన్నాళ్లు అంధ విశ్వాసాలు ఎక్కువగా వాడేవాడు. ఇప్పుడు మూలాలు అన్న పదాన్ని ఎక్కువగా వాడడం కనిపిస్తోంది.

"ఇవాళ ప్రైమరీ విద్యా విధానం నుండి పీజీ వరకూ ఆవకాయ నుండి ఆకాశం వరకూ ఎందులో చూసినా అవినీతే. ఈ అవినీతివల్లే మనవాళ్లు వలసపోతున్నారు. దీన్ని నిరోధించాలంటే విప్లవం రావాలి. అదే సాయుధ విప్లవం. తుపాకీ గొట్టం ద్వారానే ప్రజాస్వామ్యం విస్తరించాలి" అని తన మామూలు ధోరణిలోకి దిగాడు.

"మామయ్యా! అడ్డు తగుల్తున్నాననుకోకు. ఇవాళ తుపాకీ పట్టుకున్నవాళ్లంతా త్యాగధనులంటావా? ఇవాళ విప్లవకారులమంటారు, తరువాత పోలీసులకు సరెండరయి పోయి ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. వాళ్లే రెండు చేతుల్తో అవినీతి విత్తనాలు జల్లుతున్నారు."

"అబ్బ... ఎక్కడో,ఎవడో వెధవ పనులు చేసాడని అందర్నీ అదే అద్దాలతో చూడకూడదు అయినా వాళ్లనీ మనం అర్థం చేసుకోవాలి" అని అంటుండగానే అమ్మవచ్చి "ఒరే మామయ్య ఉంటాడుగానీ బజారుకెళ్లి కూరలు పట్టుకు రావాలి. అర్జంటుగా వెళ్లమ్మా!" అంది.

నేను బ్యాగ్ పట్టుకుని వెళ్ళబోతుంటే నేనూ వస్తానని మామయ్య బయలుదేరాడు. ఇద్దరం కలసి మాట్లాడుకుంటూ నడుస్తుంటే "బాబూ రిక్షా కావాలా?" అంటూ రిక్షావాలా పిలిచాడు.

"బొంకులదిబ్బకెళ్లాలి. ఎంతో చెప్పు!"

"ఆర్రూపాయలిచ్చేయండి!"

"మూడ్రూపాయలిస్తా!"

"ఒక్కరెక్కితే నాల్రూపాయలిత్తారండీ."

"నీ ఇష్టం!"

వాడు కొంతసేపు మా వెనుకాలే వచ్చి "అయిదిస్తా రాండీ!" అన్నాడు.

"పైసా ఎక్కువివ్వను."

"నాల్రూపాయలండీ"

"దమ్మిడీ ఎక్కువివ్వను."

"పోనీ మామయ్యా! రూపాయేకదా ఎక్కువ?" అన్నాను.

కనప్పమన్నాడు నామీద. వాడు ఈసురోమని మరికొంత దూరం మా వెనుకనే వచ్చి "ఎక్కండి బాబూ!" అన్నాడు.

ఇద్దరం ఎక్కి కూర్చున్నాం.

బొంకులదిబ్బ దగ్గర మామయ్యే జేబులోంచి పర్సుతీసి లెప్రసీ వాని తెగిపోయి రాలిపోవడానికి సిద్ధంగా వున్న వేళ్లలాంటి రెండ్రూపాయల నోటునీ, పోల్చుకోవడానికి అవకాశంలేని అలాంటి రూపాయి నోటునీ తీసి ఇచ్చాడు. రోజూ నేను కొంటున్న కూరల ఆసామీ దగ్గర వంకాయలూ, దొండకాయలూ, బెండకాయలూ కొన్నాను. మొత్తం ఇరవై అయిదు రూపాయలు చెప్పిందావె.

ఇవ్వబోతుంటే "వంకాయలెంత?" అడిగాడు మామయ్య.

"పన్నెండు అందరికీ. ఈ బాబుకి పదికే ఏసాను!"

"బెండకాయలు!"

"కేజీ పదేను. దొండకాయలు ఎనిమిది బాబుకయితే" అని చెప్పిందామె.

మామయ్య అరగంట వాదించి పదిహేనిచ్చాడు.

"ఇతందేవూరు బాబూ? ఇతగానితో ఎల్తే నీ పరువు పోద్ది!" అంది. విసురుగా "నీ మొగం చూసి ఊరుకున్నాను. నేపోతే ఆ కూరలు ఇతగానికే ముష్టేద్దును" అంది. అ మాటలు మెల్లగా అంది. అప్పటికే మామయ్య ముందుకెళ్లడం చూసి నేనావిడ చేతిలో అయిదు రూపాయల నోటు పెట్టేసి నోరు మూయించాను.

దారిలో చెప్పు తెగిపోయింది మామయ్యకి.

జోడు రిపేరు చేయమని ఇచ్చాడు. అక్కడా అయిదు రూపాయలు అడిగితే పీచు బేరమాడి రెండు రూపాయలిచ్చాడు. నాకు మామయ్య మన్తత్వం అర్థం అయింది.

ఇంటికెళ్లాక ఉండబట్టలేక అడిగేసాను.

"మామయ్యా! దోపిడి, శ్రమశక్తి అని అంటావుకదా మరీ రిక్షావాని దగ్గర, జోళ్లు కుట్టినవాడి దగ్గర అంత పీచు బేరం ఆడావేంటి మామయ్యా!" అని.

'ఒరే కుర్రకుంకా! డబ్బు విలువ నీకేం తెలుసురా! నా కొడుకును అమెరికా పంపానంటే నేనెంత కష్టపడ్డానంటావ్? అహర్నిశలు శ్రమిస్తేనేకదా ఇంతవాణ్ణయ్యాను. ఆ పువ్వులోనూ, ఈ పువ్వులోనూ మకరందాన్ని ఓచోట పెడితేనే కదా తేనె వస్తుంది. వాడు కష్టపడిందానికి తగిన ఫలితమే ఇవ్వాలి. ఇవాళ ప్రతి వ్యక్తీ మరో వ్యక్తిని దోచుకోవడం మొదలుపెట్టాడు. దోపిడీతత్వాన్ని నేను నిరసిస్తాను. అది ఏ తరహా వ్యక్తులలో వున్నా" అన్నాడు.

"మనుష్యుల్ని కూర్చోబెట్టి గాడిదల్లా ఈడ్చుకెళ్లే ఈ పద్ధతిలో బానినత్వం కనిపించలేదా? ఇది అన్యాయంగా కనిపించడంలేదా?"

"కానీ... ఇది ఈ దేశం మొత్తం మీదున్న పద్ధతి. మనం అర్థికంగా ఎదిగిన నాడు ఇది నిషేధింపవలసిందే కాదన్ను అలాగని వాడికివ్వాల్సిన దానికంటే ఎక్కువివ్వడం మంచి పద్ధతికాదు" అన్నాడు మామయ్య.

ఆ తరువాత దేశంలో రెడ్ టేపిజమ్ గురించి, వరకట్న సమస్య గురించి, నక్సలిజం గురించి చాలేసేపు మాట్లాడాను మామయ్యతో. నాకిప్పుడు మామయ్య పూర్తిగా అర్థమయ్యాడు.

ఇంతకీ మా మామయ్యని కా.కా మామయ్య అని ఎందుకంటారో మీకు తెలీదుకదూ? మా మామయ్య ఇంటి పేరు కాంగ్రెగులవారు. పేరు కామేశ్వరరావు. సంక్షిప్తంగా కా.కా. మామయ్య అంటాం. మా ఇంట్లో అందరూ కామ్రేడ్ కామేశ్వరరావు అంటారు. అలా పిలుస్తే మామయ్య చాలా గొప్పగా ఫీలవుతాడు.

నిజానికి కిశోర్ బావ కట్నం విషయంలో నిర్ణయం మామయ్యదే. అయినా తనకేం ప్రమేయం లేదని, తప్పంతా అత్తమీద రుద్దినట్టు నాకిప్పుడర్థం అవుతోంది.

అయితే ఒకటి మాత్రం నిజం.

మా కా.కా. మామయ్య నుండి నేర్చుకోవాల్సినవి లేకపోయినా తెలుసుకోవలసిన మాత్రం ఎన్నో ఉన్నాయి.